# నామమే జీవితమునకు పెద్దనావ

సర్వేవై సుఖినస్సంతు సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖమాప్నుయాత్

ప్రేమస్వరూపులారా!

లోకమంతా సుఖముగను, సౌఖ్యముగను, ఆదర్శముగను, ఆనందముగను ఉండవలెనన్నదే భారతీయసంస్కృతియొక్క ప్రధాన సూత్రము. భారతదేశము ఆధ్యాత్మికమునకు, దానధర్మములకు పుట్టినిల్లు. శాంతి, అహింసలకు మెట్టినిల్లు. భారతదేశమునందున్న సత్యవ్రతము మరే దేశమందు కానరాదు. ఈ గడ్డ సప్తఋషులకు జన్మస్థానము. ఆదికవి వాల్మికి, వేద విభజన గావించిన వ్యాసులు జన్మించిన స్థానము. రాముడు ఏలిన రాజ్యము, ఈ భారతదేశము. కృష్ణుడు బోధించిన గీతయందలి ధర్మక్షేత్రము, ఈ భారతదేశము. బుద్ధుడు సంచరించిన పుణ్యభూమి, ఈ భారతభూమి. అనేక అవతారములకు ఆలవాలమైన స్థానము, ఈ భారతభూమి. ఇట్టి పవిత్రమైన భారతీయతత్త్వమును భారతీయులే గుర్తించుకోలేకపోతున్నారు.

**దానధర్మములే భారతీయుల సంపద**

దానములేని హస్తము, భక్తిప్రపత్తులులేని భారతీయుడు ఈ జగత్తులో కానరాడు. తరతరములనుండి తరగని సంపద ఈ భారతభూమికి ఇదే! దానధర్మములే భారతీయుల సంపద. ఏ చిన్న విషయమునకుగాని భారతీయులు భగవత్ప్రార్థన ప్రధానముగా భావించి ఆచరించేవారు. ఇట్టి సంపదకు బాలబాలికలే వారసులు. ఈనాటి బాలబాలికలు ఈ పవిత్రమైన సంపదను నిలబెట్టుకొనుటకై తగిన కృషి చెయ్యాలి. అనాదికాలమునుండి ఈ భారతదేశము ఆధ్యాత్మిక సంపత్తితో అన్ని దేశములకు సుస్థిర శాంతి, భద్రతలను చేకూర్చుచు వచ్చుచున్నది. నాటికి నేటికి 'లోకా స్సమస్తా సుఖినోభవంతు' అన్నదే

sri sathyasai vachanamrutam

భారతీయుల లక్ష్యము. ఇట్టి పవిత్రమైన లక్ష్యములను, ఇట్టి పవిత్రమైన భావములను, ఇట్టి పవిత్రమైన సంపదను ఈనాడు భారతీయుడు కోల్పోతున్నాడు. కేవలము భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన వాంఛలకై అర్రులు చాచుచున్నారు, భారతీయులు. శరీరములో రక్తము శుభ్రముగా ఎంతకాలము ప్రవహించుచుండునో అంతకాలము ఈ శరీరము ఆరోగ్యముగా ఉంటుంది. అదే విధముగా భారతీయుల అంతరాత్మయందు దైవచింతన ఎంతకాలము ఉండునో అంతకాలము ఆనందమునందిస్తూ ఉంటుంది. ఆనందము ప్రత్యేకించినది కాదు. హృదయాంతరాళమునందు దివ్యమైన భావములను, భవ్యమైన భావములను, నవ్యమైన భావములను ఏనాడు అభివృద్ధి గావించుకొనునో ఆనాడే మానవుని ఆనందము హృదయస్థమవుతుంది.

**హృదయమును ప్రేమతోనింపుకున్నప్పుడు ప్రతి సంకల్పము ప్రేమమయంగా ఉంటుంది**

ప్రతి సంకల్పము హృదయమునుండే ఆవిర్భవించుచున్నది. కనుక హృదయమును ప్రేమతో నింపుకున్నప్పుడే ప్రతి సంకల్పము, ప్రతి క్రియ ప్రేమమయమైనదిగా ఉంటుంది. కనుక, ఈనాడు భారతీయులు నింపుకొనవలసినది ప్రేమయే! హృదయస్థానమునుండి ఆచరించే ప్రతికర్మ ప్రేమమయంగా మారుతుంది. మన ప్రాచీనకాలమునుండి వచ్చుచున్న ఈ సంస్కృతులను ఈనాడు మనము పోషించుకొనుటకు తగిన కృషి చేయాలి. నామమునకు నియమమేలేదు. జాతిమతకులభేదములు ఏమాత్రము అన్వయించవు. ఏ విధమైన వయః ప్రమాణములేదు. దీనికి భాషాభిమానము లేదు. ఇట్టి పరిస్థితియందు భగవన్నామము సర్వులకు దాటడానికి నావయే. ఇట్టి నామచింతనచేతనే ప్రాచీనకాలమునుండి భారతదేశము రక్షింపబడుచున్నది. భారతదేశమునందున్న మహత్తరమైనట్టి సత్సంపత్తి మరొకదేశమునందు కానరాదు. విలియమ్ విక్టర్ అనేవాడు ప్రథమ ప్రకృతి పరిశోధకుడు. అతను చెప్పినది ఏమిటి? ఈ సమస్త జ్ఞానమునకు, సమస్త విజ్ఞానమునకు, సమస్త సుజ్ఞానములకు, సమస్త వైజ్ఞానికమునకుకూడా ఒకటి ఆధారము ఉన్నది. ఇదియే పరమసత్యము. ఇట్టి సత్యమును ఆవిర్భవింపచేసిన భూమి భరతభూమి. 'సత్యాన్నాస్తి పరోధర్మః' అన్నట్లు సర్వధర్మములకు మూలాధారమైనది సత్యమే. కనుక సత్యమే దైవము. సత్యనారాయణుడే దేవుడు. అట్టి

sri sathyasai vahini / vachanamrutam

సత్యమును మనము విస్మరించకూడదు. భారతభూమియందు దివ్యమైన దైవత్వము సత్యరూపముతో వెలువడినదే అనే సత్యాన్ని పరిశోధకులే పరిశీలించి ప్రబోధలు చేస్తూ వచ్చారు. అయితే ఈనాడు అట్టి పరిశోధనలకు మనము దూరమైపోతున్నాము. తుచ్ఛమైన, క్షణికమైన పరిశోధనలకై కోట్లకు ఖర్చుపెట్టి కాలమునంతయు వ్యర్థము చేసి జీవితమునే నిరర్థకము గావించుకుంటున్నాం. దైవత్వము పరిశోధనలచే మనకు లభ్యమయ్యేదికాదు. అయితే ఈ భక్తిప్రపత్తులు దైవాన్ని చూపటానికి లేకపోయినప్పటికిని దైవాన్ని చేరుటకు ఒక ఉపాయము వెతుకుతూ ఉంటుంది. నవవిధ సాధనలన్నీ దైవముయొక్క ఉనికిని నిరూపిస్తూ వస్తున్నాయి. ఒక చిన్న ఉదాహరణము. చెరకులోని తీపి, మిరపలోని కారము, నిమ్మలోని పులుపు ఇవన్నీ భగవంతుని ఉనికిని ప్రబోధించేవే! తారలు వెలుగుతున్నాయి, గ్రహములు తిరుగుతున్నాయి, సూర్యుడు మండుతున్నాడు, గాలి వీచుచున్నది, వర్షములు కురియుచున్నవి. అన్నింటికి ఉనికి భగవత్‌తత్త్వమే! భగవంతుని ఉనికిని తెలియజేసేవే ఈ చర్యలన్నీకూడను. పర్వతములు చూచినప్పుడు మహా ఆనందమువేస్తుంది. ప్రవాహమును చూస్తే ఆనందము ఉప్పొంగిపోతుంది. అడవులు చూస్తే ఆనందము ఉట్టిపడుతుంది. ఇవన్నీ భగవంతుని చిత్రవిచిత్రములే! ఇట్టి ప్రకృతి సౌందర్యము భగవంతుని ఉనికిని నిరూపిస్తూ వస్తున్నది.

**సమస్తశక్తులు మానవునియందే ఇమిడియుంటున్నవి**

మానవునియొక్క ఉనికి ఏమిటి? ఈ శరీరముయొక్క తత్త్వమే విచిత్రమైనది. బయట ఏమహత్తరమైన శక్తులున్నవో ఆ సమస్త శక్తులు మానవునియందే ఇమిడి ఉంటున్నవి. సర్వ మహనీయులుకూడా సమస్త గ్రంథములుకూడా నిన్ను నీవు గుర్తించుకోమని ప్రబోధిస్తూ వస్తున్నాయి. తనను తాను గుర్తించుకోటం అంటే ఏమిటి? నేను ఫలానవాని పుత్రుడను అన్నంతమాత్రమున తనను తాను గుర్తించుకోటంకాదు. నేను ఫలానా అధికారిని అని చెప్పినంతమాత్రమున తనను తాను గుర్తించుకోటంకాదు. నేను ఫలానా దేశీయుడను అని చెప్పుకున్నంతమాత్రమున తననుతాను గుర్తించుకున్నట్లుకాదు. నేను మంచి పండితుడను అని చెప్పుకున్నంతమాత్రమున తనను తాను తెలుసుకోటంకాదు. ఇవి నిత్యజీవితంలో

sri sathyasai vahini

మనము ఉపయోగించుకునే డైలాగు పదములు. ఇవన్నీ శరీరమునకు సంబంధించినవే! నేను బ్రాహ్మణుడను, నేను యవ్వనుడను, నేను వృద్ధుడను, నేను పురుషుడను, నేను స్త్రీని అని ఈ ప్రభావములన్నీ కేవలము దేహమునకు సంబంధించినవి. ఇది తనను తాను తెలుసుకోటం కాదు. దేహిని తెలుసుకోటమే తనను తాను తెలుసుకోటం. ఈ శరీరమును తెలుసుకోటం కాదు, శరీరిని తెలుసుకోవాలి. క్షేత్రమును తెలుసుకున్నంతమాత్రమున తనను తాను తెలుసుకున్నట్లుకాదు, క్షేత్రజ్ఞుని తెలుసుకోవాలి. 'క్షేత్రజ్ఞంచాపి మాం విద్ధి' అన్నారు. ఈ రెండింటి ఏకత్వమే మానవత్వము అన్నారు. ఈ క్షేత్రజ్ఞుని తెలుసుకొనుటకు దేహమనే క్షేత్రము అవసరము. ఈ క్షేత్రమును సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడే క్షేత్రజ్ఞుని పవిత్రత మనకు అర్థమవుతుంది. మానవునియందున్న ఈ దివ్యశక్తులన్నీ ఏ విధముగా మనము ప్రచారప్రబోధలు సల్పాలి. మనకు ఉండవలసిన ప్రధానలక్షణములు ఏమిటి? వెన్నవంటి మనసు, వెన్నెలవంటి హృదయము, తేనెవంటి పలుకు ఈ మూడింటిని మనము అభివృద్ధి చేసుకున్నప్పుడు యిదే దివ్యత్వమునకు సరైన మార్గము. మనస్సు చూస్తే మహాచేదుగా ఉంటున్నది. హృదయముచూస్తే మహా చంచలముగా ఉంటున్నాది. మాటలుచూస్తే చాలా కఠినముగా ఉంటున్నాయి. ఇది మానవత్వమునకు చిహ్నముకాదు. కేవలము కౄరత్వమునకు చిహ్నము. ప్రతి మానవుని మాట తేనెవంటి మాటగా ఉండాలి. హృదయము వెన్నెలవంటి హృదయముగా ఉండాలి. మనసు వెన్నవంటి మనసుగా ఉంటుండాలి. అదే మానవత్వమునందు దైవత్వము. ఇట్టి భగవంతుని ఉనికి కనుక్కోటానికి ఆధ్యాత్మిక మార్గము ఎంతైనా తోడ్పడుతున్నది. ఏ మార్గమునందైనా భగవంతుని మనం చేరవచ్చు. కనుకనే నవవిధ మార్గములు ప్రబోధించి గమ్యము ఒక్కటే అనే సత్యాన్ని నిరూపించి, దివ్యమైన నామస్మరణనే దీనికి సరైన రాజమార్గమని ప్రబోధిస్తూ వచ్చింది.

## సర్వకర్మ భగవత్ప్రీత్యర్థమనే భావమును హృదయములో చిత్రించుకోవాలి

ధ్యానముచేసినా, జపముచేసినా, తపముచేసినా, క్రతువులాచరించినా నామమే దీనికి మూలాధారము. ఋగ్వేదము అంతయు నామముతోనే కూడినది. యజుర్వేదమంతయు మంత్రముతో చేరినది. సామవేదమంతయు గానముతో కూడినది. గానము, నామము,

srisathyasaivachanamrutam

మంత్రము, ఈ మూడింటితో కూడినదే మానవుని హృదయము. కనుక ఈ దేహాన్ని యంత్రమంత్రతంత్ర రూపముతో నిరూపిస్తూ వచ్చారు. దేహమే ఒక యంత్రము. మన శ్వాసయే ఒక మంత్రము, హృదయమే తంత్రము. ఏమిటి, యీ శ్వాసయనే మంత్రము. అదియే 'సోహం'. ఈ శ్వాసయే 'సోహం' అనే మంత్రాన్ని జపిస్తూ వస్తున్నాది. ఈ హృదయమనే తంత్రము సరైన మార్గములో ప్రకృతిని గురించి ప్రబోధిస్తున్నాది. దీనిని అందించటానికి దేహమనే యంత్రము అత్యవసరము. ఈ యంత్రములో ఏ చిన్న భాగమైన సరిగా లేకపోయిన యంత్రము పనికిరాదు. రాకెట్టు చంద్రమండలానికి పంపుతున్నాము. చంద్రమండలానికి రాకెట్టులోపల ఏ చిన్న స్క్రూ అయినా, పిన్ అయినా సరే, సక్రమముగా ఉంటుండాలి. ఏ చిన్న పిన్ను అయినా సరిగా లేకపోతే క్రిందపడి భస్మమైపోతుంది ఆ రాకెట్టు. కనుక, మానవుని సర్వేంద్రియములు సక్రమమైన రీతిలో పరిశుద్ధముగా ఉండాలి. అప్పుడే ఈ మానవత్వము దివ్యత్వముగా మారటానికి అవకాశముంటుంది. దీనికి సరైన మార్గము ఏమిటి? ఏ కర్మలాచరించినా 'భగవత్ప్రీత్యర్థం చేస్తున్నాను' అనే ఉత్తమభావము ఉంచుకున్నప్పుడే సార్థకమవుతుంది. నీ పనులు నీవు వదలనక్కరలేదు. నీ వృత్తులు నీవు మాననక్కరలేదు. నీ ఉద్యోగములు నీవు మాననక్కరలేదు. సర్వకర్మలు ఆచరించు. కానీ సర్వకర్మలు భగవత్ ప్రీత్యర్థమనే భావాన్ని హృదయములో చిత్రించుకోవాలి.

## దేహమునకు శ్వాస ఎంత ప్రధానమో ఆధ్యాత్మికమునకు విశ్వాసము అంత ప్రధానము

ప్రేమస్వరూపులారా! దేనికైనా విశ్వాసము చాలా ప్రధానము. విశ్వాసములేక ఏ కార్యము సాధించలేము. మానవునికి ప్రధానమైనది విశ్వాసము. దేహమునకు శ్వాస ఎంత ప్రధానమో ఆధ్యాత్మికమునకు విశ్వాసము అంత ప్రధానము. ఈనాడు విశ్వాసములేని భక్తి, శ్వాసలేని జీవితము జరుగుతున్నది. ఇంద్రియనిగ్రహమును గురించి చెపుతూ 'కాడి క్రిందకు రాని ఎద్దు, కళ్ళెములేని గుఱ్ఱము, బ్రేకులులేని కారు, ఇంద్రియనిగ్రహములేని జీవితము నిరుపయోగమ'న్నారు. దీనికి సరైన దీక్షను పూనాలి. అన్నింటికి నామస్మరణే ప్రధానము. ఇదిలేక జీవితమనే నావ దాటటానికి వీలులేదు. నామమే జీవితమునకు పెద్దనావ. నావను ఎంతకాలమైనా సముద్రములో పెట్టుకొని ప్రయాణము చేయవచ్చు.

srisathyasaivahini.org

నావక్రింద ఎంత జలమైనా ఉండవచ్చు. కానీ నావలోపల జలము చేర్చితిమా ప్రమాదమవుతుంది. జలము నావలో ఉండిన ప్రమాదమవుతుంది. ఇలాంటి ప్రాకృత భావములు జీవిత నావలో ప్రవేశించినప్పటికిని నామచింతన చేసినప్పుడు నిర్మలంగా, నిస్వార్థంగా, నిశ్శబ్దంగా నామచింతన చేయాలి. ఆడంబరంగాగానీ, అహంకారముగాకానీ నామము ఉచ్చరించకూడదు. అందువల్లనే నవవిధమార్గములలో ఏ మార్గమునైనా అనుసరించమని చెప్పారు. ఎట్లా మనము అనుభవించాలి? ప్రశాంతమైన భావముతో, నిర్మలహృదయముతో, నిస్వార్థమైన చిత్తముతో నామమునుచ్చరించాలి.

**శ్రవణం కీర్తనం విష్ణోస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనం**

ఇవి పవిత్రమైన భావముతో మనం చేయాలి. ఏదో ఒకరిపై ఒకరు పోటీపడి పాడకూడదు. ఒకరిపై హాస్యాస్పదమైన పాటలుగా మనం పాడకూడదు. నామసంకీర్తన చేస్తున్నప్పుడు ఏ చింత మన హృదయములో ప్రవేశించకూడదు. ఏ నామము స్మరిస్తున్నామో ఆ నామ రూపమే మన హృదయములో చిత్రించుకోవాలి. అదే నిజమైన నామస్మరణ. ఈ కలియుగమందు అదే ప్రధానమైన ప్రాణము. కృతయుగములో ధ్యానము, త్రేతాయుగములో యజ్ఞము, ద్వాపరయుగములో అర్చనము, కలియుగములో నామస్మరణ, సాధనా మార్గములు.

**నామస్మరణకు మించిన సులభమార్గములేదు**

**హరేర్నామ హరేర్నామ హరేర్నామైవ కేవలమ్**
**కలౌ నాస్త్యేవ నాస్త్యేవ నాస్త్యేవ గతిరన్యథా**

ఈ కలియుగములో నామస్మరణకు మించిన సులభమైన మార్గము ఇంకొకటిలేదు. ప్రయాణముచేస్తూ మనస్సులో నామస్మరణ చేసుకోవచ్చు. నిద్ర వచ్చేంతవరకు నామస్మరణ చేసుకోవచ్చు. ఏ పనులు చేస్తున్నా నామస్మరణ చేయవచ్చు. అతి పవిత్రమైన, సులభమైన మార్గము ఈ కలిలో. కలియుగము చాలా సులభమైనది, తరించుటకు. పూర్వకాలము ఆరోగ్యము కాపాడుకొనుటకై ఆరోగ్యశాలలు ఎక్కడా కనిపించెడివికావు. విద్యాభ్యాసముచేసే నిమిత్తమై విద్యాసంస్థలు ఎక్కడా ఉండేవికావు. ధనమును సంపాయించుటకు ఏమార్గములు

sri sathyasai vachanamrutam

ఉండేవికావు. శ్రమచేసి ధనము సంపాయించేవారు. రెక్కలాడితే డొక్కలాడతాయని కష్టపడి పని చేసేవారు. కానీ ఈనాడు ధనము సంపాయించుటకు అతి సులభమార్గములెన్నో ఉంటున్నాయి. విద్యలభ్యసించుటకు కావలిసినన్ని విద్యాసంస్థలుంటున్నాయి. వీధివీధియందు ఆరోగ్యశాలలుంటున్నాయి. మనకు ఏ కొరతలు లేవు. కానీ, ఉన్నది ఒకే ఒక కొరత, దైవవిశ్వాసము లేకుండాపోతున్నాది. అదే కొరత, అదిలేక ఏమి ప్రయోజనము? దైవవిశ్వాసమే లేక ఏమి ఉండినా ప్రయోజనములేదు. కనుక దైవవిశ్వాసమును మనం అమితంగా పెంచుకోవాలి. ప్రాచీనకాలమునుండి వస్తున్న ఈ సంస్కృతిని మన విద్యార్థినీ, విద్యార్థులు పోషించాలి.

**సమస్త సంఘర్షణలకు కారణము దైవమునందు విశ్వాసము లేకపోవటమే!**

మన సంస్కృతికి బాలబాలికలే నిజమైన వారసులు. ఈ వారసత్వమును మనము పట్టి సాధించాలి. ఇది ప్రపంచములో ప్రతిరంగములో ప్రవేశించి ఆధ్యాత్మిక చింతన పోషించాలి. అనవసరమైన దానిలో పోట్లాడి ప్రాణాలు కోల్పోతున్నారు, ఈనాడు. ఉద్రేకాలు అధికమైపోతున్నాయి. ఉత్సాహాలు క్షీణించిపోతున్నాయి. మానవత్వము అడుగంటిపోతున్నాది. దానవత్వము పెరిగిపోతున్నాది. ఇదికాదు, ఈనాటి యువకులకు ఉండవలసింది. మన దేశ సంస్కృతిని, మన మాతృభూమి సంస్కృతిని, మానవత్వముయొక్క దివ్యత్వమును నిలబెట్టుకోటానికి కంకణము కట్టుకోవాలి. అందరూ ఐకమత్యంగా పనిచేయాలి. ఆధ్యాత్మిక ప్రచారప్రబోధలు అమితంగా జరగాలి. అందరియందు ఉండినది ఏకాత్మయే అనే భావము స్థిరము చేసుకోవాలి. ఈ సత్యాన్ని గుర్తించుకుంటే లోకములో సంఘర్షణలు ఉండటానికి వీలులేదు. ఈనాడు ఎక్కడచూచినా సంఘర్షణ. ఇంటిలో సంఘర్షణ, వీధిలో సంఘర్షణ, గ్రామములో సంఘర్షణ, దేశములో సంఘర్షణ. ఎక్కడచూచినా పోట్లాటలే! ఇంటిలో ఎవరులేరు, భార్యాభర్తలే అనుకుంటే వారిద్దరిమధ్యకూడా సంఘర్షణ. ఒకడు యస్ అంటే ఒకడు నో. ఈ వికృతియైన కుత్సితమైన భావములకు ఏది కారణము? దైవవిశ్వాసము లేకపోవుటే మూలకారణము. అహంకారమే మూలకారణము. అసూయ మూలకారణము. ఆడంబరమే మూలకారణము.

srisathyasaivachanamrutam

ఈ దుర్మార్గ గుణములను మనము దూరము గావించాలి. అప్పుడే మనము శివస్వరూపులైపోతాము.

**దైవత్వమే సర్వులందు ఆత్మస్వరూపమై యున్నది**

> **సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివం**
> **సచ్చిదానందరూపం అద్వైతం సత్యం శివం సుందరం.**

సర్వస్వరూపములు శాంతియుతమైనవి. ఎవరి హృదయములోపల సర్వత్ర సర్వకాలములందు సర్వప్రదేశములందు దైవచింతన ఉంటే అదే శివం. అద్వైతం ఏమిటి? సచ్చిదానంద స్వరూపమే అద్వైతము. మన ఆనందమే అద్వైతము. ఇది సత్. సత్ అనగా ఎప్పటికి ఉండేటువంటిది. ఇది చక్కెర. ఈ చక్కెర దేనితో కలిపినా తీపి ఉంటుంది. నీటిలో కలుపు, పాయసంలో కలుపు, టీలో కలుపు, కాఫీలో కలుపు, దేనిలోనైనా కలుపు. తీపి, తీపిగానే ఉంటుంది అదే సత్. అదే నిత్యము. ఎప్పటికి మార్పు చెందనిదే సత్, Being. చిత్ అనేక జ్ఞానములతో మారుతుంది. పరిపూర్ణ జ్ఞానతత్త్వమే చిత్. ఇది ఎక్కడ వేసినప్పటికిని మారుతూనే వుంటుంది. అజ్ఞానములో అజ్ఞానముగా, విజ్ఞానములో విజ్ఞానముగా, సుజ్ఞానములో సుజ్ఞానముగా ఉంటుంది. అన్నింటిని purify చేసే జ్ఞానమే ఆత్మజ్ఞానము. అదే ఆధ్యాత్మిక జ్ఞానము. అదియే ఆధ్యాత్మిక విద్య. 'ఆధ్యాత్మవిద్య విద్యానాం' అనింది గీత. ఇది జలము వంటిది. నీరు నీరు, చక్కెర చక్కెర. ఇవి రెండు విడివిడిగా ఉండినప్పుడే సత్‌సత్, చిత్‌చిత్‌గా ఉంటుంది. రెండింటిని కలుపు చక్కెరకాదు, నీరుకాదు, పానకమైపోతుంది. సత్, చిత్ రెండూ మనలో ఆవిర్భవించినప్పుడు ఆనందము మనలో ఆవిర్భవిస్తుంది. ఈ ఆనందము సత్‌చిత్ చేరికతో ఉండిన పానకము వంటిది. అమృతమువంటిది ఆనందము. ఇట్టి ఆనందము మనము అనుభవించాలనుకుంటే ఈ రెండింటి ఏకత్వము మనము పొందాలి. అదే భగవద్గీతలో బోధించిన 'ఏకాత్మ సర్వభూతాంతరాత్మ' సర్వభూతములందు ఉండినది ఒకే ఆత్మయే. అన్ని బల్బులందు ఉండినది ఒకే కరెంటే. ఒక్కొక్క బల్బు ఒక్కొక్క రంగులో కనిపించవచ్చు, ఒక్కొక్క బల్బునందు ఒక్కొక్క వోల్టేజి ఉండవచ్చు, కానీ కరెంటు ఒక్కటే! దైవత్వమే సర్వులందు ఆత్మస్వరూపమై ఉన్నది. సర్వులందు చైతన్యస్వరూపమై

sri sathyasai vahenamrutam

ఉంటున్నాది. సర్వులందు ప్రేమస్వరూపమై ఉంటున్నాది. ఆ ప్రేమతత్త్వమును మనం గుర్తించాలి. ప్రేమతత్త్వమును మనం అనుభవించాలి. ఆ ప్రేమతత్వాన్ని మనం పంచాలి. ఆ ప్రేమతత్త్వాన్ని ప్రచార ప్రబోధలు చేయాలి. అదే ఆధ్యాత్మిక ప్రచారము.

**మానవత్వమునుండి దైవత్వమువరకు ప్రయాణము చేయ్యాలి**

ప్రేమస్వరూపులారా! నిజముగా భారతదేశము ఎంత పుణ్యభూమో, జ్ఞానభూమో, కర్మభూమో, త్యాగభూమో, యోగభూమో చెప్పలేము. ఇట్టి పవిత్రమైన భారతదేశములో పుట్టి, మరణించాలని విదేశీయులు ఎంతయో వాంఛించారు. Max Muller ఈ భారతభూమిలో పుట్టాలి నేను, ఏ జన్మము వచ్చినాకూడా భారతభూమిలో జన్మించాలన్నాడు. అంత సత్యాన్ని గుర్తించినవాడు కనుకనే Max Muller ను మోక్ష ముల్లర్ అన్నారు. వేదమును సరియైన రీతిలో విచారణ సల్పినవాడు Max Muller. భారతదేశములో ప్రతి దేహములోని ఒక్కొక్క రక్తపు చుక్క పవిత్రమైనది, అన్నాడు. అణువులు అన్నీ బ్రహ్మగా మార్చుకుంటూ వచ్చాడు Max Muller. ఈనాడు భారతీయులు ఇట్టి పవిత్రత మరచిపోతున్నారు. విదేశీయులు ఇట్టి పవిత్రతనందుకొని ఆనందమును అనుభవిస్తున్నారు. వారిలో ఒక విధమైన మహాపరివర్తన జరుగుతున్నది. విత్తు చెట్టుగా మారిపోతున్నాది. చంటి బిడ్డ తల్లిగా మారిపోతున్నాది. అన్నింటియందు పరివర్తన జరుగుతున్నాది. గుడ్డు పిట్టగా మారిపోతున్నాది. ఇవన్నీ పరివర్తనా ప్రభావములే! కాని ఈనాటి మానవుడు దేవుడుగా మారడానికి కృషి చేయడం లేదు. మానవత్వమునుంచి క్రిందకు అనగా దానవత్వానికి దిగజారిపోతున్నాడు. కాదు, కాదు; మనము ముందుకు పోవాలి. ప్రమోషన్ రావాలి. రివర్సులో మనం పరుగెత్తరాదు. మానవునినుండి దైవత్వమువరకు ప్రయాణము చేయాలి. పశుత్వమునుంచి వచ్చాము. మానవత్వములో జీవిస్తున్నాము. దివ్యత్వములో మనము అంత్యము గావించాలి. అదే నిజమైన మానవత్వము.

**శివరాత్రి అనగా అజ్ఞానమనే చీకటిని పారద్రోలేది**

ప్రేమస్వరూపులారా! ఎలాంటి పరిస్థితియందైనాకూడను భగవత్భేదము మీరు



sri sathyasai vachanamrutam

ఏమాత్రము పాటించకండి. అల్లా అయినా, రాముడైనా, క్రీస్తు అయినా అంతా దైవము ఒక్కడే! 'ఏకప్రభువుకే అనేకనాం'. గమ్యము ఒక్కటే! జాతి, మత, భేదములు, కలహాలకు ఏమాత్రము అవకాశము ఇవ్వకూడదు. నీ మతము, నా మతము అని ఎవ్వరు చెప్పకూడదు. 'నీ మతము, నా మతము', అని ఎవరు చెబుతున్నారో వారు మతిలేనివారే! నీది, నాది అనే భేదము పాటించకూడదు. మనది మనది our religion, our country అనే భావము రావాలి my country, my language అనే సంకుచితమైన దానికి, స్వార్థమునకు అవకాశము ఇవ్వకూడదు. ఈ విధమైన భిన్నత్వముపోయి ఏకత్వము మనలో ప్రారంభించాలి. వ్యష్టి జీవి, సమిష్టి దేవుడు. దేవుడు అనగా సమిష్టియే. వ్యష్టి జీవుడు మాత్రమే. ఇలాంటి వ్యష్టులు చేరినప్పుడే దేవుడు అవుతుంది. అందరు అన్యోన్యమైన భావములో ప్రేమతత్త్వము పెంచుకుంటూ రావాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ ఈ పవిత్రమైన శివరాత్రి దినమందు ఇదే పవిత్రమైన నిజమైన శివతత్త్వాన్ని అనుభవించాలి. ఈ శివరాత్రి వర్షానికి ఒక పర్యాయము వస్తుంది. కానీ మనలో నున్న మంగళకరమైన గుణములు నిరంతరము ఉంటుంటాయి. 'సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనమ్' ఇదియే నిజమైన శివం. యిదియే నిజమైన రాత్రి. రాత్రి అనగా చీకటి. చీకటిని పారద్రోలేదే శివం. శివరాత్రి అనగా చీకటిని పారద్రోలేది. అనగా అజ్ఞానమును నిర్మూలముగావించేదే శివరాత్రి. ఈ విధంగా మీరు విశ్వసించి దుర్గుణములను దూరము గావించుకొని సదాచారములు, సత్ప్రవర్తన అభివృద్ధి పరచుకొని సర్వేశ్వర అనుగ్రహానికి పాత్రులై 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' సర్వేశ్వర స్వరూపులౌతారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 18-02-1996న పూర్ణచంద్రలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam